సాక్షి నిజామాబాద్

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



అమరవీరుల త్యాగాలు..

హైదరాబాద్ విమోచనానికి పోరాడిన వారి త్యాగాలు చిరస్మరణీయమని 12(టీ) బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ అన్నారు.

- 8లో ▸



నిర్ణీత గడువులోగా..

భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9 /22.6

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గీత కార్మికులపై వీడీసీ ముసుగులో జరిగిన దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గౌడ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణానికి మంగళవారం తాళ్లరాంపూర్ గీత కార్మికులతోపాటు ఆర్మూర్ డివిజన్‌లోని గౌడ కులస్తులు తరలివచ్చారు. మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా బయల్దేరి నిజాంసాగర్ కెనాల్‌పై బైఠాయించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రాలు సమర్పించారు. గౌడ కులస్తులు పోన్నం సత్యనారాయణగౌడ్, సాయిబాబాగౌడ్, దేగాం యాదగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తేనే ఫలితాలు




నిజామాబాద్‌నాగారం: బాధ్యతాయుతంగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా విద్యాబోధనపై దృష్టి సారించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. ఇంటర్ విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, సాంఘిక సంక్షేమ, గురుకుల, మోడల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. మొదటి సంవత్సరం అడ్మిషన్లు, యూడైస్, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం, గతేడాది ఫలితాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ విద్యావ్యవస్థను నమ్మి ప్రభుత్వ కళాశాలల్లో చేరారని, వారి ఆశలు వమ్ము కాకుండా విద్యాబోధన జరగాలన్నారు. ప్రతి వారం స్లిప్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా ఇంటర్ విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్ల గడువు 30 వరకు పొడిగింపు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రాజెక్టులను తప్పనిసరిగా 30 లోపు నామినేషన్లు నమోదు చేసుకోవాలని పొడిగించినట్లు జిల్లా విద్యాధికారి అశోక్ మంగళవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి సెలవుల ఉన్నందున 20వ తేదీ లోపు ఎట్టి పరిస్థితుల్లో నామినేషన్లు పూర్తి చేసుకోవాలని తెలియజేశారన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్‌ను సంప్రదించాలన్నారు.

ఇందూరు వీరుల విముక్తి పోరు

- నిజాం అరాచక పాలనపై 700 మందికి పైగా పోరాటం
- 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని దాశరథి కృష్ణమాచార్యులు నినదించింది ఇక్కడి జైలు నుంచే..
- విముక్తి పోరులో ఎనలేని ఆర్యసమాజ్ పాత్ర
- రాజకీయ ఖైదీల బొందల గడ్డగా పేరుగాంచిన ఇందూరు ఖిల్లా జైలు





నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం తెలంగాణ 13 నెలల పాటు వీరోచిత పోరాటం చేయాల్సి వచ్చింది. జిల్లాలో ఏడు వందల మందికి పైగా పోరాటంలో పాల్గొన్నారు. ఖిల్లా జైలు గోడలపై దాశరథి కృష్ణమాచార్య బొగ్గుతో రాసిన 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' నినాదం నిజాం విముక్తి పోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. ఈ పోరాటంలో ఆర్యసమాజ్ కీలక పాత్ర పోషించింది. జైలులో అనేక చిత్రహింసలను అనుభవించిన సమరయోధులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. తెలంగాణ విముక్తి పోరాటంలో రాధాకృష్ణ మోదాని, సర్దార్ ప్రేమ్‌సింగ్, సర్దార్ వామాన్‌సింగ్, నల్ల నర్సింహారెడ్డి తదితరులు ప్రాణాలు అర్పించారు.



గాంధీచౌక్‌లోని అమరవీరుల స్థూపం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారతదేశంలో భాగమయ్యేందుకు గాను తెలంగాణ విముక్తి కోసం నిజాం నవాబుపై ఇందూరు వీరులు చేసిన పోరాటం తిరుగులేనిది. జిల్లాకు చెందిన 700 మందికి పైగా ప్రాణాలకు తెగించి పోరాటం చేశారు. పలువురు అమరులయ్యారు. పోరాట ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ గడ్డపై త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. దేశానికి 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వాళ్ల నుంచి స్వాతంత్ర్యం లభించినప్పటికీ తెలంగాణ మాత్రం అదనంగా మరో 13 నెలల పాటు వీరోచిత పోరాటం చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో నిజాంకు వ్యతిరేకంగా రాసిన సాహిత్యం ప్రధాన పాత్ర పోషించింది. అనేక మంది కవులను వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన నిజాం పాలకులు కొంతకాలం పాటు నిజామాబాద్ ఖిల్లా జైలులో బంధించారు. వీరిలో దాశరథి కృష్ణమాచార్యులు, వట్టికోట ఆళ్వారులు లాంటివారు ఉన్నారు. దాశరథి కృష్ణమాచార్య నిజామాబాద్ జైలులో మూడు నెలల పాటు ఉన్నట్లు సమాచారం. ఈ సమయంలో దాశరథి జైలు గోడలపై పళ్లు తోముకునే బొగ్గుతో నిజాం పాలనకు వ్యతిరేకంగా సాహిత్యాన్ని రాశారు. 'నా తెలంగాణ కోటి అందాల జాణ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గోడలపై రాశారు. ఈ నినాదం అప్పటి నిజాం విముక్తి పోరాటంలో తిరుగులేని విధంగా ఉద్యమాన్ని ముందుకు నడిపింది.

- 1939 సెప్టెంబర్ 2న ఇందూరు గంజ్ కమాన్ వద్ద ఒక అరబ్బు వ్యక్తి పోలీసు స్టేషన్ వద్ద రాధాకృష్ణ మోదానిని కత్తితో పొడిచి చంపాడు.
- 1939 అక్టోబర్‌లో రజాకార్లు దసరా ఊరేగింపుపై దాడి చేసి సర్దార్ ప్రేమ్‌సింగ్, సర్దార్ వామాన్‌సింగ్‌లను చంపారు.
- 1946 నవంబర్ 28న ప్లేగు శిబిరంలో నల్ల నర్సింహారెడ్డిని రజాకార్లు కాల్చి చంపారు.
- 1947 జూన్ 3న దత్తోపంత్ నాయక్ బాంబు పేలుడులో మరణించారు.
- 1931లో హైదరాబాద్ రాష్ట్రంలో సాగిన 'సివిల్ డిస్ ఒబిడియెన్స్' ఉద్యమంలో నల్ల నరసింహారెడ్డి అరెస్టయ్యారు. 1947లో హైదరాబాద్ రాష్ట్ర విలీనోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. దీంతో రజాకార్లు క్రూరంగా కాల్చి చంపారు. నిజామాబాద్‌లో నల్ల నర్సింహారెడ్డి పేరుతో ఒక వీధి ఉంది. జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం వారు నగరంలో ఈయన పేరిట ఒక స్థూపాన్ని ప్రతిష్ఠించారు.
- ఇందూరులోని గాజుల్‌పేట్‌కు చెందిన బెల్లాల్ మాణిక్‌రెడ్డి నిజాం రజాకార్ల వ్యతిరేక పోరాటంలో కీలక పాత్ర పోషించారు. న్యాయవాద విద్యనభ్యసించిన మాణిక్‌రెడ్డి ఆర్యసమాజ్ బృందాలతో కలిసి ఇందూరు యువకులకు రాత్రి సమయాల్లో కర్రసాము, కరాటే, నాటు తుపాకీ వాడకం, బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చారు. పోరాట యోధులు కనిపిస్తే కాల్చేయమని నిజాం పోలీసులు ఉత్తర్వులు జారీ చేసిన సమయంలో అనేకమంది వీరులకు తన పొలంలో, ఇంట్లో ఆశ్రయం కల్పించి వారి బాగోగులు, వారి కుటుంబాల బాగోగులు చూసుకున్నారు. అప్పట్లో మాణిక్‌రెడ్డి ఇల్లు స్వాతంత్ర్య ఉద్యమకార్లకు భోజన సత్రంగా ఉండేదని నాటి సమరయోధులు చెప్పేవారు. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ర్యాలీలు, సత్యాగ్రహ దీక్షల్లో తాను ముందుండి నాటి యువకులకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ క్రమంలో జైలుకు వెళ్లారు. తరువాత కాలంలో ఎమర్జెన్సీ సమయంలోనూ మాణిక్‌రెడ్డి అప్పటి ఇందిర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని పోరాటాల్లో ముందున్నారు. చంపేస్తామని అప్పటి కాంగ్రెస్ నాయకులు బెదిరించినప్పటికీ వెరవలేదు.
- మిఠాయి గంగారాం అనే స్వాతంత్ర్య సమరయోధుడు 1921లో నిజామాబాద్‌లో జన్మించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈయన తన వృత్తినే వదిలేసి పాల్గొన్నారు. ఆనాటి ఉద్యమంలో వీరి పాత్ర అమోఘమైనది. ఎవరికీ జంకని వీరపురుషుడీయన అంటారు. ఉద్యమంలో పాల్గొన్నందుకు నైజాం ప్రభుత్వం గంగారాంను హైదరాబాద్, సికింద్రాబాద్ జైళ్లలో విడతల వారీగా ఉంచింది. 1947 జూలై 5 నుంచి 1948 అక్టోబర్ 7 వరకు జైలులో ఉన్నారు. జైలులో అనేక అవస్థలు పడ్డారు. జైలు నుండి విడుదలైన తరువాత గంగారాం అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యసమాజ్, విశ్వహిందూ పరిషత్ కార్యకలాపాల్లో, హనుమాన్ వ్యాయామశాల స్థాపన నిర్వహణలో చాలా కృషి చేశారు.
- త్రయంబకరావు పాఠక్ 1920 డిసెంబర్ 1న ఇందూరులో జన్మించారు. తల్లిదండ్రులు అందూబాయి, రామచంద్రరావు. వ్యవసాయ కుటుంబం. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన పాఠక్ రజాకార్ల అరాచకాలను చూడలేకపోయారు. హృదయవిదారక ఘటనలు చూసి విప్లవ భావాలు పెంచుకున్నారు. ఆ కసాయివాళ్లను ఆయుధాలతోనే ఎదురించాలనుకుని, తన భార్య గాజులను అమ్మేసి హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్‌లో తన మిత్రుడు దత్తోపంత్‌తో బాంబులు తయారు చేయించారు. ఇందుకు సీహెచ్‌బీ విఠల్‌దాస్, కేవీ గంగాధర్‌లు సహకరించారు. అయితే బాంబులను రహస్యంగా చేరవేస్తున్నప్పుడు పేలుడు సంభవించి దత్తోపంత్ అనే సమరయోధుడు మరణించారు. ఇది పోలీసులకు తెలియడంతో అందరినీ బంధించి వేర్వేరు జైళ్లలో ఉంచారు. త్రయంబకరావును 1947 డిసెంబర్ 14న హైదరాబాద్ జైల్లో పెట్టారు. 1948 అక్టోబర్ 7న విడుదలయ్యారు. స్వాతంత్ర్య సమరంలో ఈయన పాత్రను గుర్తించిన భారత ప్రభుత్వం 1973 ఆగస్టు 15న తామ్రపత్రానిచ్చి గౌరవించింది. పాఠక్ ఆనాడు నిజామాబాద్ ప్రాంతంలో జరిగిన అన్ని ఉద్యమాల్లో పాల్గొన్నారు. హిందూ మహాసభకు జిల్లా కార్యదర్శిగా, ఆర్యసమాజ్ సభ్యులుగా వ్యవహరించారు. తరువాత భారత్ సేవక్ సమాజ్‌లోనూ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోనూ, కాంగ్రెస్ పార్టీ, జనతా పార్టీలలో సభ్యులై ఎన్నో కార్యకలాపాలను నిర్వహించారు.



జిల్లా కేంద్రంలోని ఖిల్లా ముఖద్వారం

బృందాలుగా సత్యాగ్రహాలు..

ఇందూరులో 1934 ఆగస్టు 24న ఆర్యసమాజ్ కార్యకలాపాలు ప్రారంభించారు. మొదటి కార్యవర్గంలో ప్రధాన్‌గా నల్ల రుక్మారెడ్డి వకీలు, మంత్రిగా మునిపల్లె గంగారాం, కోశాధికారిగా గజవాడ మాణిక్యం నియమితులయ్యారు.

నిజాం విముక్తి పోరులో బృందాలుగా సత్యాగ్రహ కార్యక్రమాలు నిర్వహించారు. 1938, 1939లో బృందాలుగా ఏర్పడి పోరాటాలు చేశారు. మాణిక్యరెడ్డి, గడియారం సాంబయ్య, మునిపల్లె గంగారాం, రాధాకృష్ణ మోదానిలు అరెస్టయ్యారు.



జైలులో ఊహించని దాడి

నిజామాబాద్ జైలు 'రాజకీయ ఖైదీల బొందలగడ్డ'గా పేరుపొందింది. అనేక చిత్రహింసలను అనుభవించిన సమరయోధులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఇక్కడి జైలులో చోటు చేసుకున్న ఘటనలు దేశవ్యాప్తంగా వార్తల్లోకెక్కాయి. 1947 ఆగస్టు 15న నిజాం నిషేధాజ్ఞలను ఉల్లంఘించి త్రివర్ణ పతాకం ఎగురవేయాలని హైదరాబాద్ నుంచి శ్రీ రామానంద తీర్థ పిలుపునిచ్చారు. దీంతో ఇందూరు జిల్లాలోనూ అనేక మంది యువకులు జెండాలు ఎగురవేశారు. నైజాం పోలీసులు, రజాకార్లు దాడులు చేసి, జైలులో కిరాతకంగా కొట్టి హింసించారు. 1948 జనవరి 11న రాత్రి 8 గంటల సమయంలో నిజామాబాద్ జైలు దాశరథి కృష్ణమాచార్య, వట్టికోట అళ్వార్‌స్వామి, మోతీలాల్ మంత్రి, వెంకటరమణయ్య, శ్యాం అప్పంగీకర్, జె హన్మంతరెడ్డి, విఠల్‌రెడ్డి కామారెడ్డి, బ్రహ్మయ్య, సి రాములు, పడిగల హన్మాండ్లు, అచ్యుతరావు దేశ్‌పాండే లాంటి 150 మంది రాజకీయ ఖైదీలతో కిక్కిరిసిపోయింది. వీరిపై ఒక్కసారిగా ఊహించని దాడి చేశారు. ఆ దాడి నాలుగు గోడలకే పరిమితమై ఉంటుందని నిజాం ప్రభుత్వ అధికారులు భావించారు. కానీ తుఫానులా తెలంగాణ అంతటా పాకింది. దేశంలోని అన్ని పత్రికలకు ఈ సమాచారం అందింది.



ఖిల్లా జైలులో దాశరథిని బంధించిన గది

ఇందూరు జైలులో ఉప్పొంగిన దేశభక్తి..

1948 జనవరి 11న ఇద్దరు ఇత్తెహాదుల్ ముస్లిమీన్ కార్యకర్తలను రాజకీయ ఖైదీలున్న బ్యారక్‌లో ఉంచారు. వీళ్లిద్దరూ స్టేట్ కాంగ్రెస్ ఖైదీలతో గిల్లికజ్జాలు పెట్టుకోసాగారు. జైలులో వందేమాతర గీతం ఆలపించకూడదని ఇద్దరు ఖైదీలు అభ్యంతరం చెప్పారు. అయినప్పటికీ వందేమాతరం ఆలపించడంతో ఇత్తెహాదుల్ ముస్లిమీన్‌కు చెందిన ఖైదీలు 4వ బ్యారక్‌లో ఉన్న సత్యాగ్రహులను కర్రలతో విచక్షణరహితంగా కొట్టారు. అలారం మోగించారు. జైలు వార్డెన్లు, పోలీసులు, కొందరు బయటి వ్యక్తులు జైలులోకి చొచ్చుకొచ్చి దాడిలో పాల్గొన్నారు. అందరూ కలిసి సత్యాగ్రహులను, వందేమాతరం ఆలపించిన వారిని క్రూరంగా కొట్టారు. చాలామంది తీవ్రంగా గాయపడ్డారు. తలలు పగిలాయి. కొందరి కాళ్లు, చేతులు విరిగాయి. 150 మంది సమరయోధులు తీవ్రంగా గాయపడడంతో రక్తసిక్తమైంది. జలియన్‌వాలాబాగ్‌ను తలపించిన ఈ ఘటనను దేశవ్యాప్తంగా ఖండించారు. ఆ రోజుల్లో తెలంగాణ జైళ్లలోని వార్డెన్లందరూ రాష్ట్రం బయటి నుంచి వచ్చినవారే. దీంతో ఈ జైలు రాజకీయ ఖైదీలకు అగ్నిగుండంలాగా తయారైంది. అప్పట్లో ఈ జైలును ''సియాసీ ఖైదియోంకా ఖబరస్తాన్'' (''రాజకీయ ఖైదీల బొందలగడ్డ'') అనేవారు.

పరిమితులు లేకుండా పరిహారం అందించాలి

నిజామాబాద్‌నాగారం: వరద కారణంగా నష్టపోయిన వారికి పరిమితులు లేకుండా పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి కోరారు. వరద వల్ల పంటలు నష్టపోయిన రైతులతో కలిసి మంగళవారం ఆయన కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రాంతంలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

బాధితులకు పరిహారం అందించని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, బోధన్ రూరల్ మండల అధ్యక్షుడు సిర్ప సుదర్శన్, బోధన్ పట్టణ అధ్యక్షుడు గోపికిషన్, సాలూర మండల అధ్యక్షుడు గంగాధర్, బోధన్ రూరల్ మండల మాజీ అధ్యక్షుడు రాజు మనోహర్, బోధన్ నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బీజేపీ నేతల నిరసన

రైతు సంక్షేమమే ధ్యేయంగా కృషి చేయాలి

- డ్రోన్లు కొనుగోలు చేసే రైతులకు రుణాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి
- డ్రోన్లు సబ్సిడీపై ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది
- ఇఫ్కో అందిస్తున్న నానో యూరియాను వాడితే అందరికీ మేలు
- డీసీసీబీ సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



డీసీసీబీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సహకార బ్యాంకులు మరింతగా ముందుకెళ్లాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం నిజామాబాద్ డీసీసీబీలో చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు క్షేమంగా ఉంటేనే సహకార సంఘాలు బలోపేతమవుతాయన్నారు. గతంలో ఉన్న ప్రతినిధుల కారణంగా డీసీసీబీ నష్టాల్లోకి వెళితే, ప్రస్తుత పాలకవర్గం, అధికారులు కలిసి 17 శాతం నష్టాలను 10 శాతం తగ్గించారన్నారు. రైతులకు రుణాల పంపిణీలో ట్రాక్టర్లకు కాకుండా నానో ఎరువులు పిచికారీ చేసేందుకు వీలుగా డ్రోన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సుదర్శన్‌రెడ్డి సూచించారు. డ్రోన్లు సబ్సిడీపై ఇచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

ప్రభుత్వ కంపెనీ ఇఫ్కో తయారు చేసిన నానో యూరియా వాడాలని రైతులకు సూచించారు. రసాయన యూరియా చల్లడానికి బదులు నానో యూరియా స్ప్రే చేయాలన్నారు. ప్రస్తుతం వాడుతున్న యూరియాతో ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. పంట పొలాలు కూడా యూరియా చల్లడం ద్వారా ఒకేసారి నలుపునకు వచ్చి తెగుళ్లను తట్టుకునే శక్తి క్షీణిస్తుందన్నారు.

సమావేశంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, డీసీసీబీ సీఈవో నాగభూషణం, డీసీవో శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి మేకల గోవిందు, డీసీసీబీ డైరక్టర్లు పాల్గొన్నారు.

పదిహేను లక్షల బస్తాలు

- జిల్లాలో ఇప్పటి వరకు రైతులు కొనుగోలు చేసిన యూరియా
- 70 వేల మెట్రిక్ టన్నుల పంపిణీ
- గతేడాదితో పోలిస్తే 2 వేల మెట్రిక్ టన్నులు అదనం
- అయినా కొన్ని చోట్ల రైతుల బారులు
- చర్యలు చేపడుతున్న వ్యవసాయ శాఖ

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో యూరియా అమ్మకాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఏకంగా 70వేల మెట్రిక్ టన్నుల మార్క్‌ను దాటింది. అంటే 15లక్షల 40వేల యూరియా బస్తాలను రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఇది గతేడాది ఖరీఫ్‌తో పోలిస్తే 2వేల మెట్రిక్ టన్నులు ఎక్కువ. అయితే వేరే జిల్లాల్లో యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతుంటే, మన జిల్లాలో అధికారుల ముందు చూపు కారణంగా అలాంటి పరిస్థితి లేదనే చెప్పొచ్చు. రైతులంతా వరికి మూడో డోసు కూడా యూరియా వేశారు. ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే యూరియా అవసరం ఒక్కసారిగా ఏర్పడడంతో అక్కడి మండలాలకు వ్యవసాయ శాఖ యూరియా సరఫరా చేస్తోంది. మంగళవారం బాల్కొండ, భీమ్‌గల్ మండలాల్లో సొసైటీల ముందు రైతులు బారులు తీరడంతో టోకెన్లు ఇచ్చి బస్తాలు పంపిణీ చేశారు. నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో కొరత ఏర్పడే అవకాశం ఉందన్న సమాచారం మేర కు స్టాకును తెప్పించి ఆయా మండలాలకు పంపుతున్నారు. ప్రస్తుతం జిల్లా అంతటా 50 పాయింట్లలో యూరియా అమ్మకాలు కొనసాగుతున్నాయి.



బాల్కొండ వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద క్యూలో పెట్టిన పాస్ బుక్‌లు

జిల్లాకు అవసరమైన యూరియా (అంచనా) 75 వేల మెట్రిక్ టన్నులు	
వచ్చిన యూరియా	71 వేల మెట్రిక్ టన్నులు
అమ్ముడైన యూరియా	70 వేల మెట్రిక్ టన్నులు
అందుబాటులో ఉన్న స్టాక్	1,000 మెట్రిక్ టన్నులు

యాసంగి కోసం ఇప్పుడే..

ఖరీఫ్‌లో 5,24,506 ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా, 4,36,695 ఎకరాల విస్తీర్ణంలో వరి ఉంది. ప్రస్తుతం మొక్కజొన్న కోతలు ప్రారంభం కాగా కొన్ని చోట్ల ఇరవై రోజుల్లో వరి కోతలు ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయి. ఇలాంటి సమయంలో రైతులు ఇంకా యూరియాను కొనుగోలు చేయడంపై వ్యవసాయాధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వచ్చే యాసంగి పంటలకు కూడా ఇప్పుడే యూరియాను కొనుగోలు చేసి దాచి పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అధికారులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు.

గతేడాది 68,300 మెట్రిక్ టన్నులు పంపిణీ జరిగిన యూరియా ఇప్పుడు అదనంగా 2వేల మెట్రిక్ టన్నులు అమ్ముడుపోయింది. అంటే ఇది దాదాపు 18 వేల ఎకరాలకు సరిపడా యూరియా. ఈ లెక్కన జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం పెరగాలి. కానీ అలా జరగలేదు.

అవసరం ఉన్న రైతులే కొనాలి



ఖరీఫ్‌లో సాగవుతున్న పంటలు దాదాపు చివరి దశకు చేరాయి. ఇంకా అక్కడక్కడ మాత్రమే యూరియా అవసరం ఉంటుంది. అవసరం ఉన్న రైతులే యూరియాను కొనాలి. కొరత లేకుండా జిల్లాలో ఎక్కడికి కావాలంటే అక్కడికి బస్తాలను పంపుతున్నాం. జిల్లాకు మరికొంత కోట రావాల్సి ఉంది. దీనిని రోజు వారీగా నెలాఖరు వరకు తెప్పిస్తాం.

– మేకల గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి

తాళ్లరాంపూర్‌లో ఉద్రిక్తత

- గ్రామస్తులు, గీత కార్మికుల మధ్య ముదిరిన వివాదం
- ఈ నెల 21 వరకు 163 సెక్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ
- భారీగా మోహరించిన పోలీసు బలగాలు



తాళ్లరాంపూర్‌లో మోహరించిన పోలీసు బలగాలు

మోర్తాడ్(బాల్కొండ): గ్రామస్తులు, గీత కార్మికుల మధ్య నెలకొన్న వివాదంతో ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం ఓ వ్యక్తి తన ఇంటి స్థలంలోని ఈత చెట్టును నరికేయగా దీనిపై గీత కార్మికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వివాదం ముదిరింది. గతంలోనే తాటి చెట్లను గీసే విషయంలో గ్రామంలోని కొన్ని కుల సంఘాలు, గీత కార్మికులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈ అంశంపై గ్రామంలో న్యాయ సేవాధికార సంస్థ అవగాహన సమావేశాన్ని నిర్వహించి గ్రామాభివృద్ధి కమిటీ రద్దు చేసేలా కృషి చేసింది. గ్రామాభివృద్ధి కమిటీ రద్దు చేసినట్లు ప్రకటించినా గ్రామంలోని రెండు వర్గాల మధ్య సఖ్యత కుదరలేదు. సోమవారం రాత్రి నుంచి ఈనెల 21 వరకు 163 సెక్షన్ అమలు చేస్తూ తహసీల్దార్ మల్లయ్య ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో పోలీసు బలగాలు మోహరించాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు. రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా మారాయి. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయా స్టేషన్ల ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలు గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు.

పోలీసుల తీరుపై నిరసన

బీడీ కంపెనీలో పనికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చిన ఆడెపు లక్ష్మి అనే మహిళతోపాటు ఆమె భర్త నర్సయ్యపై పోలీసులు దాడి చేశారని తాళ్లరాంపూర్ గ్రామస్తులు అంటున్నారు. పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసిన బోనగిరి లావణ్యను పోలీసులు తమ వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్తుండగా ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో చివరకు వదిలేశారన్నారు. పోలీసులు తమపై అకారణంగా దాడులు చేస్తున్నారని కొందరు ఫొటోలు తీసి సీపీ సాయి చైతన్యకు సామాజిక మాధ్యమాల ద్వారా చేరవేయడంతో ఎవరిపై దాడికి పాల్పడవద్దని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. తాళ్లరాంపూర్‌లో చోటు చేసుకున్న వివాదంపై ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, అదనపు పోలీసు కమిషనర్ బస్వారెడ్డి మోర్తాడ్‌లో ఇరువర్గాలతో చర్చలు నిర్వహించారు. అధికారులు ఈనెల 19న మరోసారి చర్చలు నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు.

క్లుప్తంగా

కామారెడ్డి కలెక్టర్‌ను కలిసిన బెటాలియన్‌ అధికారులు



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌ అడిషనల్‌ కమాండెంట్‌ సాంబశివరావు, అసిస్టెంట్‌ కమాండెంట్‌ సత్యనారాయణ మంగళవారం కామారెడ్డి కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో భారీవర్షాలు కురిసి వరద ముంచెత్తిన సమయంలో బెటాలియన్‌ ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందం అందించిన సేవలను కలెక్టర్‌ ప్రశంసించారు.

20 లోపు ఎంఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 2వ సెమిస్టర్‌ థియరీ రెగ్యులర్‌ పరీక్షలకు సంబంధించిన ఫీజును ఈ నెల 20 లోపు చెల్లించాలని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ సంపత్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈనెల 22 వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఈ పరీక్షలు సెప్టెంబర్‌/అక్టోబర్‌లో జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఇద్దరు ఏఎస్సైలకు పదోన్నతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని ఇద్దరు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి పొందినట్లు సీపీ సాయిచైతన్య మంగళవారం తెలిపారు. బాలశౌరి రాజు(నిజామాబాద్‌ ట్రాఫిక్‌), దయాల్‌ సింగ్‌ (నిజామాబాద్‌ రూరల్‌) పదోన్నతి పొందారని, రాజును నిజామాబాద్‌ కమిషనరేట్‌కు బదిలీ చేయగా, దయాల్‌ సింగ్‌ను నిర్మల్‌ జిల్లాకు బదిలీ చేశారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: పట్టణంలో ఇటీవల దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రవీణ్‌ కుమార్‌ డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. ద్వితీయ శ్రేణి జ్యుడీషియల్‌ న్యాయమూర్తి చంద్రశేఖర్‌ నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు.

ఉద్యమాల పోరుగడ్డ ‘ఇందూరు’

- నిజాం రజాకార్లపై తెగింపుతో ప్రతిదాడులు చేసిన జిల్లా ఉద్యమకారులు ఎందరో...
- నేడు నిజాంపాలన నుంచి తెలంగాణ విముక్తి పొందిన రోజు

మోర్తాడ్‌(బాల్కొండ): నిజాం రజాకార్ల గుర్రపు డెక్కల చప్పుళ్లకు వెరవని ధీరులు ఇందూరు ఉద్యమకారులు. 1947 ఆగస్టు 15న దేశమంతటా త్రివర్ణ పతాకం ఎగురవేయడానికి సన్నాహాలు జరుగుతుంటే నిజాం పాలనలో ఉన్న మనకు ఆ స్వేచ్ఛను రజాకార్లు హరించారు. మన సమరయోధులు మాత్రం రజాకార్ల ఆజ్ఞలను లెక్క చేయకుండా మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. ఫలితంగా జైలు ఊచలు లెక్కించారు.

అహింస– హింస మార్గాల్లో..

మొదటి స్వాతంత్య్ర సంగ్రామంలో మన ప్రాంతానికి చెందిన కొలాస్‌ రాజు దిలీప్‌ సింగ్‌ చూపిన పోరాట పటిమ, ఝాన్సీ లక్ష్మీబాయ్‌ ప్రదర్శించిన తెగువతో తెలంగాణకు విముక్తి కోసం కొందరు సాయుధ పోరాటానికి నాంది పలుకగా, మరికొందరూ గాంధీ బాటలో సత్యాగ్రహం ద్వారా స్వాతంత్య్ర ఉద్యమానికి ఊపిరి పోశారు. ఇలా తెలంగాణ విముక్తి కోసం హింస, అహింస మార్గాల్లో వేరువేరుగా పయనించిన యోధులకు పుట్టినిల్లుగా ఇందూరు గడ్డ నిలుస్తోంది.



రజాకర్లపై తిరుగుబాటు చేయడానికి తెలంగాణ ఉద్యమకారులకు ఆవాసమైన మోర్తాడ్‌ బురుజు

పల్లెలపై దాడులు చేస్తు అమాయక ప్రజల ధన, మాన ప్రాణాలను హరిస్తున్న రజాకార్ల గుంపుపై మోర్తాడ్‌ జమీందార్‌ రుక్మారెడ్డి ఫిరంగులతో దాడికి పాల్పడ్డాడు. దీంతో నిజాం పాలకులు అతడిని ఇనుప సంకెళ్లతో బంధించి జైల్లో ఉంచారు. అలాగే ఆర్య సమాజ్‌ ఆధ్వర్యంలో స్వామి రామానంద తీర్థ స్టేట్‌ కాంగ్రెస్‌ సత్యాగ్రహ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. చౌట్‌పల్లి నారాయణరెడ్డి ఆర్య, చౌట్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి, పడిగెల హన్మాండ్లు, నారాయణ లింగారెడ్డి, నీలకంఠ నారాయణ, పడకల్‌ శ్రీనివాస్‌రెడ్డి, శంభులింగం, లక్ష్మాగౌడ్‌, బ్రహ్మయ్య, వెంకటస్వామి, బొంబాయి నర్సింహారెడ్డి, నర్సింహారావు, నరసింహా శాస్త్రి, కొండా నారాయణ, ఉప్పు లక్ష్మయ్య, హన్మంత్‌ రెడ్డి, రంగారెడ్డిలు రామానంద తీర్థ స్టేట్‌ కాంగ్రెస్‌ ఉద్యమానికి ప్రభావితులైనారు.

ఉద్యమకారుల నుంచి ప్రజాసేవకులుగా..



అర్గుల్‌ రాజారాం, మాజీ మంత్రి (ఫైల్‌)




నారాయణ రెడ్డి, మాజీ ఎంపీ (ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): తెలంగాణ విముక్తి ఉద్యమంలో పాలుపంచుకున్న ఉద్యమకారులు తరువాత రాజకీయాల్లో చేరి ఉన్నత పదవులను అలంకరించారు. మోర్తాడ్‌ మండలం సుంకెట్‌కు చెందిన నారాయణరెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన అర్గుల్‌ రాజారాం బాల్కొండ నియోజకవర్గానికి నాలుగుమార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడంతో పాటు చేనేత, ఆర్థిక, విద్యుత్‌ శాఖ మంత్రిగా విశిష్టమైన సేవలు అందించారు. చౌట్‌పల్లికి చెందిన హన్మంత్‌రెడ్డి జిల్లా పరిషత్‌ మొట్టమొదటి చైర్మన్‌గా ఎంపికై ప్రజాసేవలో కొనసాగారు. వీరితోపాటు అనేక మంది తమ సొంత గ్రామాలలో సర్పంచ్‌లుగా, సహకార సంఘాల చైర్మన్‌లుగా ఎంపికై ప్రజలకు విశేషమైన సేవలు అందించారు.

సిరికొండ మండలంలో గత స్మృతులు

సిరికొండ: మండలంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఛాయలు నేటికి కదలాడుతున్నాయి. 1946 నుంచి 1951 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మండలంలో విస్తృతంగా సాగినట్లు ఆనాటి పెద్ద మనుషులు చెబుతుంటారు. కరీంనగర్‌ జిల్లా సిరిసిల్ల ప్రాంతానికి చెందిన అణభేరి ప్రభాకర్‌రావు నేతృత్వంలో అదే సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అమృత్‌లాల్‌ శుక్లా, శివాయిపల్లెకు చెందిన బల్‌రాంలు ఇక్కడ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారు. రజాకార్ల ఆకృత్యాలకు వేదికగా మారుతోందని హోన్నాజీపేట్‌ గడిపై వీరి ముఠా దాడి చేసింది. దాడితో గడి దొర ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌కు పారిపోయాడు. ప్రభాకర్‌రావు బృందం మండలంలోని వివిధ గ్రామాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకొని భూస్వాముల చెరలో ఉన్న భూములను పేదలకు పంచిపెట్టారు. వీరి సారథ్యంలో ఉద్యమం నడుస్తుండగా రజాకార్లకు పన్నులు కట్టడం, పశువులు మేపుకున్నందుకు చెల్లించే పన్నులను చెల్లించడం మానివేశారు. అలాగే గడ్కోల్‌ గ్రామంలో దొరల వద్ద గుమాస్తాగా పని చేసే జంగం గంగన్నను ఉద్యమకారులు గ్రామ నడిబొడ్డున కాల్చి చంపారు.



రజాకార్ల ఆకృత్యాలకు వేదికగా నిలిచిన హోన్నాజీపేట్‌ గడీ (ఫైల్‌)

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

- ప్రభుత్వ బడుల విద్యార్థులకే అవకాశం

నిజామాబాద్‌ రూరల్‌: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, తెలంగాణ(ఎస్‌ఎల్‌ఏ–ఎస్‌) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిజామాబాద్‌ జిల్లా కన్వీనర్‌ కాసర్ల నరేశ్‌ రావు, ప్రవీణ్‌ కుమార్‌ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకే ఈ అవకాశం ఉందంటున్నారు. అక్టోబర్‌ ఆరులోపు తెలంగాణ కవులైన 11మంది (బమ్మెర పోతన, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు, వట్టికోట ఆళ్వార్‌ స్వామి, వానమామలై వరదాచార్యులు, సురవరం ప్రతాపరెడ్డి, సామల సదాశివ, బోయ జంగయ్య, పాకాల యశోదరెడ్డి, కాళోజీ నారాయణరావు, సి.నారాయణరెడ్డి)పై పాఠశాల స్థాయిలో వ్యాసరచన పోటీ పెట్టాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ప్రతిభ చూపిన ఒక అమ్మాయి ఒక అబ్బాయి రాసిన వ్యాసాలను జిల్లాస్థాయి పోటీలకు పంపించవలసి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యక్ష పోటీకి ఎంపికై వచ్చిన 50 వ్యాసాల నుంచి 5గురిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపించనున్నట్లు కాసర్ల తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441406252,7989575257 నెంబర్ల ను సంప్రదించాలన్నారు.

ఎస్‌ఐఆర్‌ పకడ్బందీగా నిర్వహించాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్‌ అంకిత్‌, ఇతర అధికారులు

- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌

నిజామాబాద్‌ నాగారం: ఓటరు జాబితాలో భాగంగా చేపట్టనున్న స్పెషల్‌ ఇంటెన్సివ్‌ రివిజన్‌ (ఎస్‌ఐఆర్‌) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సబ్‌ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్‌లతో ఎస్‌ఐఆర్‌ అమలు ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలు అందిన మీదట ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వీసీలో అదనపు కలెక్టర్‌ అంకిత్‌, సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్ర కుమార్‌, మెప్మా పీడీ రాజేందర్‌, డీడబ్ల్యూవో రసూల్‌బీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’ వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్‌

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కలెక్టరేట్‌ నేడు నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవానికి ముస్తాబైంది. ఏర్పాట్లను కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, పోలీస్‌ కమిషనర్‌ సాయి చైతన్య మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉదయం 10.00 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌, సీపీ

నిర్ణీత గడువులో దరఖాస్తులను పరిష్కరించాలి

- పరిశీలనలో జాప్యం చేయవద్దు
- అధికారులకు కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి ఆదేశం

బోధన్‌: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని, పరిశీలన ప్రక్రియలో జాప్యం చేయవద్దని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సాలూర మండల తహసీల్దార్‌ ఆఫీస్‌ను మంగళవారం కలెక్టర్‌, సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతోతో కలిసి తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌ శశిభూషణ్‌ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని కలెక్టర్‌ సూచించారు. సాదాబైనామా, పీఓటీలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి వెనువెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలన జరపాలన్నారు. కొత్త రేషన్‌ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను వెనువెంటనే పరిశీలిస్తూ అర్హులకు ఆమోదం తెలుపాలన్నారు. ఎస్‌ఐఆర్‌(స్పెషల్‌ ఇంటెన్సివ్‌ రివిజన్‌) ప్రక్రియ కోసం ముందస్తుగానే అవసరమైన జాబితాను సిద్ధ చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్‌ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఎస్‌ఐఆర్‌ను పకడ్బందీగా నిర్వహించేలా సన్నద్ధమై ఉండాలని కలెక్టర్‌ అన్నారు.



సాలూర తహసీల్దార్‌ శశిభూషణ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి


కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండటంతో ప్రాజెక్ట్‌ నుంచి గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతుంది. 36 వరద గేట్ల ద్వారా 2లక్షల 32వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇన్‌ఫ్లో తగ్గినా గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు తగ్గించలేదు. దీంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం క్రమంగా తగ్గింది. ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా 6500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కులు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1089.80(75. 7టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.



గోదావరికి పోటెత్తిన వరద

రెంజల్‌(బోధన్‌): గోదావరి నదికి వరద పోటెత్తుతోంది. స్థానికంగా కురుస్తున్న వర్షాలతోపాటు ఎగువన గల నదుల నుంచి వరద నీరు రావడంతో కందకుర్తి వద్ద వరద తాకిడి గంటగంటకు పెరుగుతుంది. దీంతో అంతర్రాష్ట్ర వంతెనకు ఆనుకుని వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కందకుర్తి వద్ద గోదావరిలోని పురాతన శివాలయం పూర్తిగా నీట మునిగింది.



క్రైం కార్నర్‌

ఆలయంలో చోరీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోని గుట్టమీద గల శివ భక్త మార్కండేయ ఆలయంలో చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆలయంలోని హుండీని సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగుడు ఆలయ ఆవరణలో పగులగొట్టి డబ్బులు దొంగిలించినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యుడు ఆశోక్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే మండల కేంద్రంలో ఇంటి ముందర నిలిపిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



బైకు చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

జక్రాన్‌పల్లి: బైక్‌ చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మాలిక్‌ రెహమాన్‌ తెలిపారు. జక్రాన్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని గాంధీనగర్‌ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, వారిని పట్టుకుని విచారించారు. వారి వద్దనున్న బైక్‌ను గత నెల 18న జక్రాన్‌పల్లి బస్టాండ్‌ వద్ద నుంచి చోరీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఇద్దరు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.



నాగమడుగులో ఒకరి గల్లంతు

నిజాంసాగర్‌(జుక్కల్‌): నిజాంసాగర్‌ ప్రాజెక్టుకు దిగువన ఉన్న నాగమడుగు లోలెవల్‌ వంతెన వద్ద వరద నీటిలో ఒకరు గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామానికి చెందిన చాకలి ప్రవీణ్‌ (30) మంగళవారం అచ్చంపేట గ్రామంలోని బంధువుల వద్దకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా నాగమడుగు వద్ద వరద నీరు ఉధృతంగా ఉండటంతో ఈత కొట్టాడు. దీంతో అతడు నీటమునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీస్‌ అధికారులు వెంటనే అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. వరద నీటిలో రాత్రి వరకు గాలించారు. అయినా అతడి ఆచూకీ లభించలేదు.



చాకలి ప్రవీణ్‌ (ఫైల్‌)

అల్ప్రాజోలం పట్టివేత

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గుండారం గ్రామంలో 600 గ్రాములు నిషేధిత అల్ప్రాజోలంను నార్కోటిక్‌ అధికారులు పట్టుకున్నట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌ మహ్మద్‌ ఆరీఫ్‌ మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో గుండారం కల్లు బట్టిపై దాడి చేసి అల్ప్రాజోలంను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులైన అశోక్‌, రమేశ్‌ గౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డుపై నిలిచిపోయిన వాహనం

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్‌ శివారులో మంగళవారం ఓ భారీ ట్రక్కు టైర్‌ పంక్చర్‌ కావడంతో రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు గంటపాటు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న మాచారెడ్డి పోలీసులు పొక్లెయిన్‌ సహాయంతో ట్రక్‌ను తొలగించి, ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించారు.



అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- 12(టీ) బెటాలియన్‌ ఎన్‌సీసీ కమాండింగ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ ప్రియాజిత్‌ సూర్‌
- నగరంలోని గిరిరాజ్‌ కళాశాలలో హైదరాబాద్‌ లిబరేషన్‌ డే’ ఫొటో ఎగ్జిబిషన్‌

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌ విమోచనం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని 12(టీ) బెటాలియన్‌ ఎన్‌సీసీ కమాండింగ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ ప్రియాజిత్‌ సూర్‌ అన్నారు. నగరంలోని గిరిరాజ్‌ ప్రభుత్వ కళాశాల ఆవరణలో మంగళవారం సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ ఆధ్వర్యంలో ‘హైదరాబాద్‌ లిబరేషన్‌ డే’ ఫొటో ఎగ్జిబిషన్‌ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రియాజిత్‌ సూర్‌ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌ లిబరేషన్‌లో పోరాడిన నాయకులు చారిత్రక అంశాలను ఫొటో ఎగ్జిబిషన్‌లో పొందుపరిచారన్నారు. అనంతరం సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ ఫీల్డ్‌ పబ్లిసిటీ ఆఫీసర్‌ ధర్మనాయక్‌ మాట్లాడుతూ.. ఈ ఎగ్జిబిషన్‌లో నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్‌ సంస్థానాన్ని విముక్తి చేసేందుకు పోరాడిన రామ్‌జి గోండు, కుమురం భీమ్‌, చాకలి ఐలమ్మ, భాగ్యరెడ్డి వర్మ, తదితరుల ప్రముఖుల ఫొటోలను ఏర్పాటు చేశామన్నారు. బైరాన్‌పల్లి ఘటన, ఆపరేషన్‌ పోలో వంటి ప్రధాన ఘట్టాలను వివరించే ఫొటోలు కూడా ప్రదర్శనకు ఉంచామన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ ఈనెల 18 వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్‌మోహన్‌ రెడ్డి, డిస్ట్రిక్‌ ఉమెన్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ రసూల్‌ బి, పోస్టల్‌ డిపార్ట్‌మెంట్‌ సీనియర్‌ సూపరింటెండెంట్‌ జనార్దన్‌ రెడ్డి, ఎన్‌వైకే కోఆర్డినేటర్‌ శైలీ బెల్లాల్‌, ఆల్‌ ఇండియా రేడియో ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ మోహన్‌దాస్‌ పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రియాజిత్‌



కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోర్తాడ్‌(బాల్కొండ): నిజామాబాద్‌ జిల్లా మోర్తాడ్‌ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల్‌ జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెట్‌పల్లికి చెందిన తాటికొండ పురుషోత్తం(59) సోమవారం కారులో వ్యక్తిగత పనుల నిమిత్తం నిర్మల్‌కు వెళ్లాడు. మంగళవారం వేకువజామున తిరిగి మెట్‌పల్లికి అదే కారులో బయలుదేరారు. మోర్తాడ్‌ వద్ద కారు డ్రైవర్‌ శేఖర్‌ హైవేపై ఉన్న సెంట్రల్‌ లైటింగ్‌ డివైడర్‌ను గమనించకపోవడంతో వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో డ్రైవర్‌ పక్కన కూర్చున్న పురుషోత్తంకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. గాయాలైన డ్రైవర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. పురుషోత్తం భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.



పురుషోత్తం (ఫైల్‌)



మోర్తాడ్‌లో డివైడర్‌ను ఢీకొన్న కారు

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నగరంలోని బస్‌డిపో–1 ప్రహరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఈనెల 14న ఉదయం సదరు వ్యక్తి అపస్మారకస్థితిలో ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే అతడిని చికిత్స నిమ్మిం జీజీహెచ్‌కు తరలించారు. కానీ వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారలు లభించలేవని, అతడు బూడిద రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించాడని పోలీసులు తెలిపారు. మృతుడు భిక్షాటన చేసుకునే వ్యక్తిగా కనపడుతున్నట్లు చెప్పారు. ఎవరికైనా అతడి వివరాలు తెలిస్తే వన్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.



పెద్దమల్లారెడ్డిలో యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఎల్క తిరుపతి (20) గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. గతంలో అమ్మాయిలను వేధించిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి అతడు డబ్బులు కావాలని తల్లి రామవ్వపై ఒత్తిడి చేశాడు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో, అతడు ఇంటికి వెళ్తున్నానని చెప్పి దూలానికి ఉరి వేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఉరి వేసుకున్న కొడుకును చూసి తల్లి రోదించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్‌ అంజయ్య ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.



తిరుపతి (ఫైల్‌)

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్‌

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్‌ తెలిపారు. మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన సిద్దిగారి యాదగిరి ఇటీవల నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చెయ్యి కోసుకొని తమతో అనుచితంగా ప్రవర్తించడంతోపాటు తమ విధులకు ఆటంకం కలిగించాడని ఎస్సై తెలిపారు. అలాగే మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు గంగారాజు ఇటీవల మద్యం తాగి తన ఇంటిముందర విద్యుత్‌ స్తంభం లేదని చెబుతూ సెల్‌టవర్‌ ఎక్కి డయల్‌ 100కు కాల్‌చేస్తూ, పోలీసులను దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించాడన్నారు. దీంతో యాదగిరి, గంగారాజుపై కేసులు నమోదుచేసి అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

దాడిలో గాయపడ్డ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

- నిందితులపై హత్య కేసు నమోదు

ఖలీల్‌వాడి: దంపతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని దొడ్డికొమరయ్య కాలనీకి చెందిన షకీల్‌(45) శనివారం మద్యం తాగి ఇంటి పక్కన ఉండే దంపతులు(నాగు–సరస్వతి)తో గొడవపడ్డారు. దీంతో మరుసటి రోజు ఉదయం దంపతులు షకీల్‌ ఇంటికి వెళ్లి గొడవపడ్డారు. ఈక్రమంలో షకీల్‌ తలకు బలమైన గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేశామని ఆరో టౌన్‌ పోలీసులు తెలిపారు. అనంతరం దంపతులను అదుపులోకి తీసుకున్నామని వారు వివరించారు.